ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 29 ఆగస్టు 2025



జేపీ నగర్‌లో..


# ఊరూరా వెలసిన ఉండ్రాళ్లయ్య





రాజాజీ నగర్ మిల్క్ కాలనీలో అమెరికన్ డైమండ్ గణపతి

బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వినాయకచవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఊరూరా గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి, విద్యుత్ దీపాలతో మండపాలను అలంకరించి పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచే మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు. బెంగళూరు నగర వ్యాప్తంగా ప్రాంతాల వారీగా విభిన్నరూపాలలో వినాయకులు విగ్రహాలు పూజలు అందుకుంటున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో వినాయకుడి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దొడ్డబళ్లాపురలో ఆర్‌సీబీ విజేత జట్టు వినాయకుడు ఆకర్షణగా ఉంది. గరుడ వాహనంపై ఊరేగుతున్నట్లు ఉన్న రూపం ప్రత్యేకత అనిపించింది. ఎనిమిది చేతుల గణపతి, లక్ష్మీ, సరస్వతీ, పార్వతీలు తిలకిస్తుండగా మహాసముద్రంలో అమృతం వెలికి తీసే రూపం (మిగతా 7వ పేజీలో..)



దొడ్డబళ్లాపురలో ఐపీఎల్ కప్‌తో..



నగరంలో లక్ష్మి, సరస్వతి సమేతంగా కొలువుదీరిన గణనాథుడు



రాయచూరులో పర్యటిస్తున్న రాష్ట్ర ఉప లోకాయుక్త బీరప్ప

## వ్యర్థాలు కలుస్తున్నా కానరాదా..?

- కృష్ణానదిలోకి పరిశ్రమల రసాయనాలపై ఉపలోకాయుక్త ఆగ్రహం
- అధికారులపై కేసు నమోదుకు ఆదేశం

రాయచూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆ శాఖ అధికారి శైలజపై సుమోటోగా కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఉప లోకాయుక్త బీరప్ప ఆదేశించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర ఉప లోకాయుక్త గురువారం రాయచూరు నగరంలోని కేంద్ర బస్ స్టేషన్, ఏపీఎంసీ, కూరగాయల మార్కెట్ పరిసరాలు, అనంతరం చిక్కసగూరు, యద్లాపూర్ వద్ద ఉన్న పరిశ్రమల వాడలను తనిఖీ చేశారు. చిక్కసగూరు, యద్లాపూర్ వద్ద ఉన్న పరిశ్రమల్లో నుంచి రసాయన వ్యర్థాలు బయటికి రావడం పంటల పై ప్రభావం చూపడంతో పాటు అవి నేరుగా వెళ్లి కృష్ణా నదిలో కలుస్తుండడాన్ని ఉప లోకాయుక్త తీవ్రంగా పరిగణించారు. వీటన్నిటిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ పర్యావరణ శాఖ అధికారిని నిలదీశారు. అదే సమయంలో గ్రామస్థులు విషపూరిత రసాయనాల వల్ల చర్మ రోగాల బారిన పడుతున్నట్లు ఫిర్యాదు చేయడంతో అందుకు సంబంధించి సాయంత్రంలోగా తనకు నివేదిక ఇవ్వాలంటూ గ్రామ పీడీఓను ఆదేశించారు. నగరంలోని ఏపీఎంసీ, కూరగాయల మార్కెట్ పరిసరాలను పరిశీలించిన ఉప లోకాయుక్త అక్కడ కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పాటు ఏపీఎంసీలో పని చేసే హమాలీలు నివశిస్తున్న కాలనీ నుంచి మార్కెట్ వరకు బస్సు సౌకర్యం లేదంటు ఆయన దృష్టికి తీసుకోరాగా వెంటనే అక్కడికి సిటీ బస్సు ఏర్పాటు చేయాలంటు రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర బస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. శౌచాలయాలు వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు.



ఏపీఎంసీ మార్కెట్‌లో రైతులతో మాట్లాడుతూ..



# ఇకపై గ్రేటర్

- గ్రేటర్ బెంగళూరు అథారిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్
- అధ్యక్షుడిగా సీఎం, ఉపాధ్యక్షుడిగా డీసీఎం.. 75మందికి స్థానం

బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు పాలన కోసం ఉద్దేశించిన బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) తన అస్థిత్వాన్ని కోల్పోనుంది. బీబీఎంపీని విభజించి ఐదుపాలికెలుగా ఏర్పాటు చేసి సెప్టెంబరు 2నుంచి గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) అమలులోకి వచ్చేలా రాష్ట్రప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. జీబీఏ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపాధ్యక్షుడిగా డీసీఎం డీకే శివకుమార్ సహా మొత్తం 75మంది సభ్యులు ఉండేలా తీర్మానించారు. బెంగళూరు నగరం నుంచి ప్రాతినిధ్యం వహించే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొత్తగా ఏర్పాటయ్యే 5 పాలికెలకు మేయర్ ఎంపికలో నామినేటెడ్ సభ్యులుగా ఉంటారు.

బీడీఏ, బీఎంఆర్‌డీఏ, బీడబ్ల్యుఎస్ఎస్‌బీ, బీఎంటీసీ, బీఎంఆర్‌సీఎల్, బెస్కాం, డల్ట్, నగర పోలీస్ కమిషనర్, అగ్నిమాపకశాఖ ముఖ్యులు, నగర జిల్లా అధికారి, కొత్త పాలికెల కమిషనర్‌లు నామినేటెడ్ సభ్యులుగా ఉంటారు. జీబీఏ చీఫ్ కమిషనర్ నామినెటెడ్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు.

### ఎమ్మెల్యేలకు అవకాశం

గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ)లో నగరం నుంచి ప్రాతినిధ్యం వహించే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నామినేటెడ్ సభ్యులుగా ఉండనున్నారు. బెంగళూరు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, శోభాకరంద్లాజె, రాష్ట్ర మంత్రులు రామలింగారెడ్డి, కేజే జార్జ్, దినేశ్ గుండూరావు, కృష్ణబైరేగౌడ, భైరతి సురేశ్, జమీర్ అహ్మద్‌ఖాన్, ఎంపీలు పీసీ మోహన్, డాక్టర్ సీఎన్ మంజునాథ్, తేజస్వీసూర్య, రాజ్యసభ సభ్యులు జైరాం రమేశ్, జగ్గేశ్, లెహర్‌సింగ్, జీ.సీ చంద్రశేఖర్, నారాయణ ఇందులో చోటు దక్కించుకోనున్నారు.



ఎమ్మెల్యేలు ఎస్ఆర్ విశ్వనాథ్, భైరతి బసవరాజ్, ఎస్‌టీ సోమశేఖర్, మునిరత్న, ఎస్ మునిరాజు, కే గోపాలయ్య, డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, ఏసీ శ్రీనివాస్, ఎస్ రఘు, రిజ్వాన్ అర్షద్, ఎన్ఏ హ్యారిస్, ఎస్ సురేశ్‌కుమార్, ప్రియకృష్ణ, ఎం కృష్ణప్ప (విజయనగర్), ఉదయ్ గరుడాచార్, ఎల్.ఏ రవి సుబ్రమణ్య, ఆర్ అశోక్, నీకే రామమూర్తి, మంజుళా లింబావళి, సతీశ్‌రెడ్డి, ఎం కృష్ణప్ప (బెంగళూరు దక్షిణ), ఎమ్మెల్సీలు పుట్టణ్ణ, గోవిందరాజ్, గోపినాథ్, హరిప్రసాద్, జవరాయిగౌడ, కేశవప్రసాద్, ఎన్ నాగరాజు, శరవణ, యతీంద్ర సిద్దరామయ్యలు ప్రజా ప్రతినిధుల కోటాలో జీబీఏలో సభ్యులుగా ఉంటారు.

బెంగళూరు ఉత్తర, బెంగళూరు దక్షిణ, బెంగళూరు తూర్పు, బెంగళూరు పశ్చిమ, బెంగళూరు సెంట్రల్ పాలికెల మేయర్‌లు, కమిషనర్‌లు, నగర జిల్ల అధికారి జీ జగదీశ్, అగ్నిమాపక అత్యవసర సేవల విభాగం డైరెక్టర్ టీఎన్ శివశంకర్, జీబీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, ఇంజనీర్లు ఉంటారు.

బెంగళూరు నగర సాలిడ్‌వేస్ట్ మేనేజిమెంట్ లిమిటెడ్ ఎండీ మహేశ్వర్ రావ్, బీడీఏ కమిషనర్ మణివణ్ణన్, నగర పోలీస్ కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్, బీఎంఆర్‌సీఎల్ ఎండీ డాక్టర్ రవిశంకర్, బీఎంఆర్‌డీఏ మహానగర్ కమిషనర్ రాజేంద్రచోళన్, నగర రవాణా డైరెక్టరేట్ కమిషనర్ దీపాచోళన్, జలమండలి అధ్యక్షుడు డాక్టర్ రామ్‌ప్రసాత్ మనోహర్, బీఎంటీసీ ఎండీ రామచంద్రన్, బెస్కాం ఎండీ డాక్టర్ శివశంకర్‌లు నామినెటెడ్ సభ్యులుగా ఉంటారు.

### జీబీఏ చీఫ్ కమిషనర్ పోస్టు భర్తీకి ఆదేశం

గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) ఏర్పాటుకు వెంటనే అన్వయించేలా ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుతం జీబీఏ చీఫ్ కమిషనర్‌గా బీబీఎంపీ చీఫ్ కమిషనర్‌గా ఉంటున్న ఎం మహేశ్వరరావ్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. జీబీఏ చీఫ్ కమిషనర్ పోస్టును కూడా భర్తీ చేసేలా నగరాభివృద్ధి శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

### కొత్త పాలికెల ఏర్పాటుతో పాలనకు బలం

ప్రస్తుతం 5 కొత్త పాలికెల ఏర్పాటుకు గెజిట్ జారీ చేసి ప్రజలనుంచి అభ్యంతరాలను ఆహ్వానించింది. ఈ వారాంతంలో తుది గెజిట్ విడుదలయ్యే అవకాశం ఉంది. తద్వారా సెప్టెంబరు 2నుంచి ఐదు పాలికెలు అస్తిత్వంలోకి రానున్నాయి. ఇటీవలి శాసనసభ వర్షాకాల సమావేశంలో జీబీఏ బిల్లుకు కొన్ని సవరణలు చేశారు. కొత్త పాలికెలకు త్వరలోన ఎన్నికలు జరిపేందుకు ప్రభుత్వం సానుకూలం వ్యక్తం చేసింది. దీనికితోడు పాలికెకు ఎన్నికలు నిర్వహిచేందుకు సంబంధించి సుప్రీంకోర్టు విచారణ వేళ జీబీఏ ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించింది. ఈ కారణంగానే జీబీఏ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యంతరాలు తొలగి సకాలంలో పాలికెలు అందుబాటులోకి వస్తే పాలనకు మరింత బలం చేకూరనుంది.

### యతీంద్రకు అవకాశంపై ఆశ్చర్యం...!



గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ)కు నామినేట్ కానున్న 75మందిలో సీఎం సిద్దరామయ్య కుమారుడు ఎమ్మెల్సీ యత్రీందకు కూడా అవకాశం కల్పించడం ఆశ్చర్యం కలిగించింది. జీబీఏ అనేది బెంగళూరునగరానికి సంబంధించినది కావడంతో ఇతర జిల్లాలవారికి అవకాశం ఉండదు. అయితే ఎమ్మెల్సీ యతీంద్ర మైసూరుకు చెందినవారు. ఒకవేళ ఎమ్మెల్సీలు పర్మనెంట్ అడ్రెస్ బెంగళూరుగా ఉంటే మాత్రమే అవకాశం దక్కుతుంది. ప్రస్తుతం బెంగళూరు చిరునామాలు కల్గినవారిలో 15మంది సభ్యులు ఉండగా అందులో యతీంద్ర పేరు లేదు. అయినా కూడా ఇందులో అవకాశం కల్పించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.



మారునున్న బెంగళూరు స్వరూపం



కొట్టూరు తహసీల్దార్ కార్యాలయం ముందు గొర్రెలతో ఆందోళన చేస్తున్న కాపరులు

## గొర్రెలతో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు
- వ్యాధులతో జీవాలు మృతి చెందుతున్నాయని ఆగ్రహం

8

## పేకాట క్లబ్బులపై దాడులు

**రూ.1.93 లక్షల నగదు స్వాధీనం.. 46 మంది అరెస్టు**

బళ్లారి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ శోభారాణి కలిసి పేకాట క్లబుల పై దాడులు నిర్వహించారు. మనప్రభ అనే భవనంలోని మూడో అంతస్తులోనూ, తిప్పయ్య క్లబులో రెండు చోట్లు దాడులు నిర్వహించినట్లు ఎస్పీ శోభారాణి తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్(డీ.సీ) పోలీస్ బృందం జాయింట్ యాక్షన్ చేపట్టామన్నారు. మలప్రభ అనే భవనం, తిప్పయ్య క్లబుల్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు పక్కాసమాచారం అందిందన్నారు. దాడుల్లో రూ.1.93 లక్షల నగదు, 13 మద్యం ఖాళీబాటిళ్లు, 53 ప్యాకెట్ల ప్లేయింగ్ కార్డ్సుతోపాటు పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నామన్నారు. 46 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నగరంలో ఎక్కడైనా అసాంఘీక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీ మిశ్రా, ఎస్పీ శోభారాణి



తుంగభద్రకు హారతి ఇస్తున్న వేద పండితులు

8

## వైభవంగా తుంగభద్ర హారతి

- తొలిసారి కార్యక్రమం
- కాశీ నుంచి ప్రత్యేక బృందం



విరూపాక్షేశ్వరాలయం ముందు ఎర్రటి మబ్బులు



స్తంభాల మధ్య నుంచి సూర్య భగవానుడు

7

## అరుణ కిరణం

- హంపిలో సూర్యాస్తమయం సందర్భంగా ఎరుపెక్కిన మేఘాలు

# వలసలో ముగిసిన బతుకులు

## జమ్మలమడుగు వద్ద బైక్‌ను ఢీకొట్టిన కారు

## ఇద్దరు రొద్దం మండల కూలీలు మృతి



ఆంజనేయులు, శివకుమార్ (ఫైల్)



నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

రొద్దం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దం మండలం కంచిసముద్రం గ్రామానికి చెందిన వడ్డె ఆంజనేయులు(25), శ్యాపురం గ్రామానికి చెందిన శివకుమార్ యాదవ్(25) మృతిచెందారు. హంద్రీనీవా కాలువ పనులు చేసేందుకు వీరు కూలీలుగా వెళ్లారు. పని ప్రదేశం వద్ద భోజనం చేయడానికి మంచి నీరు లేకపోవడంతో తెచ్చుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. ప్రధాన రహదారిపైకి బైక్ ఎక్కే సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను బుధవారం రాత్రి స్వగ్రామాలకు తీసుకువచ్చారు. పెనుకొండలో మంత్రి సవిత వారికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం బాధిత కుటుంబాలకు నగదు సాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆంజనేయులు భార్య మమత మూడు నెలల గర్భిణి. వీరికి మూడేళ్ల కూతురు ఉంది. ఈ ప్రమాదంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. మృతులవి పేద కుటుంబాలని, ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు విన్నవించారు.

### మద్యం తాగి బైక్ నడుపుతూ..



తిమ్మప్ప (ఫైల్)

గుమ్మఘట్ట: మద్యం మత్తులో బైకు నడుపుతూ గోనబావి గ్రామానికి చెందిన తిమ్మప్ప(50) ప్రాణాలు కోల్పోయాడని పోలీసులు తెలిపారు. అతివేగంగా వెళుతూ గణేష్ అనే యువకుడిని బైక్‌తో ఢీకొట్టి.. తిమ్మప్ప కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గణేషను రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### పంది అడ్డు రావడంతో..

తాడిపత్రి: పట్టణంలోని బ్రైలర్స్ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి పంది అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి శామ్యూల్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు తెలిపారు. నందలపాడుకు చెందిన శామ్యూల్ స్టీల్‌ప్లాంట్ కార్మికుడు. పుట్లూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో తన స్నేహితుడి కొడుకు పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఆయన భార్య రాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### బైక్ అదుపు తప్పి.. చేనేత కార్మికుడు..

ధర్మవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన అక్కం సతీశ్‌కుమార్(36) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... అక్కం సతీశ్‌కుమార్, అతడి భార్య కవిత చేనేత కార్మికులు అయితే బుధవారం రాత్రి 8-45 గంటలకు భోజనం చేయడానికి సిద్ధమవుతుండగా ఫోన్ రావడంతో ద్విచక్రవాహనంపై అక్కం సతీశ్‌కుమార్ బయటకు వెళ్లాడు. అదే సమయంలో అతడి తమ్ముడు అనిల్‌కుమార్ ఇంటి వద్దకు వచ్చాడు. సోదరుడు బయట ఉన్నాడని తెలుసుకుని ఫోన్ చేసి పెట్రోల్ తీసుకుని రమ్మన్నాడు. సతీశ్‌కుమార్ పెట్రోల్ తీసుకుని వస్తూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చికెన్ సెంటర్ మలుపు వద్ద బైకును అదుపు చేయలేక కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడు..

హిందూపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన హిందూపురం మండలం లో గురువారం రాత్రి జరిగింది. ద్విచక్రవాహనంపై హిందూపురం వస్తుండగా గౌరీబిదనూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు పట్టణంలోని యర్రకొట్టాల ప్రాంతానికి చెందినవాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

### చికిత్స పొందుతూ బాలిక మృతి

ధర్మవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గాయపడి, ఆస్పత్రిలో పొందుతున్న బాలిక బుధవారం సాయంత్రం మృతి చెందింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పుణుగుడు గ్రామానికి చెందిన పొట్లూరు శ్రీహరి, రేష్మ దంపతుల పెద్దకుమార్తె వెంకటేశ్వరి(10), కుమారుడు భరత్‌కుమార్, చిన్నకుమార్తె రమ్యతో కలిసి పట్టణానికి మూడు నెలలక్రితం వలస వచ్చారు. శారదానగర్‌లో ఉంటున్నారు. శ్రీహరి బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. గతనెల 14వ తేదీన చంద్రబాబునగర్‌లో మాయకుంట్ల జయచంద్రకు చెందిన ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పెద్ద కుమార్తె వెంకటేశ్వరి కూడా తల్లిదండ్రులతో పాటు వెళ్లింది. బాలిక మిద్దెపైన ఆడుకుంటూ 11 కేవీ విద్యుత్ వైర్లకు ప్రమాదవశాత్తు తగలడంతో కిందపడి గాయపడింది. వెంటనే తల్లిదండ్రులు.. బాలికను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం, అక్కడి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈనెల 24వ తేదీన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై బాలిక తల్లిదండ్రులు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

## శిక్షణకు ఇంజనీరింగ్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ఎస్ఈలు, ఈఈలు, డీఈలకు ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు రోజులపాటు గ్రామీణ తాగునీటి పథకంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎస్ఈ సురేష్‌తోపాటు శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి ఈఈ విజయ్‌భాస్కర్, డీఈలు శ్రీనివాసులు, శ్రీధర్ శిక్షణకు వెళ్లారు.

## వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

రామగిరి/చెన్నేకొత్తపల్లి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మండలానికి చెందిన వైసీపీ నాయకులు ఒక ప్రకటనలో పరిటాల కుటుంబంపై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. రా ప్తాడు ఎంపీపీ భర్త సత్తిరెడ్డి, మరూరు మాజీ సర్పంచ్ సాకే వెంకటేశ్, రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ఏపీ ముత్యాలు, ఫణీంద్ర పలువురు నాయకులతో కలిసి గురువారం సాయంత్రం రామగిరి, సీకేపల్లి పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

## నీరుగంటి వీధిలో వైద్యశిబిరం

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీరుగంటి వీధిలో 6వ డివిజన్ ఇన్‌చార్జి లావణ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఫ్రెండ్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో ఆ దిత్యా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో శిబిరం నిర్వహించా రు. స్థానికులకు వైద్య పరీక్షలు తర్వాత మందులు అందించారు. లావణ్య, టీడీపీ రామకృష్ణ మాట్లాడుతూ యువత మానవత్వంతో కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు.

## 'సర్పంచ్‌లూ.. అధైర్యపడకండి'

శింగనమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు అధైర్యపడవద్దని, వచ్చే నేలలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతాయని పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో భరోసా ఇచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ రాజేంద్ర ప్రసాద్ పలుసార్లు సీఎంకు వివరించినట్లు తెలిపారు.

# ప్రాణాలు తీసుకున్నారు..!

## ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య

## కుటుంబాల్లో విషాదం



ప్రియసాయి (ఫైల్)

పరిగి/బ్రహ్మసముద్రం/శెట్టూరు/తాడిపత్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నింపారు. ఒంటరితనాన్ని భరించలేక పరిగి మండలం సేవామందిరంలోగల రాజేశ్వరి లేఅవుట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ప్రియసాయి (26) బుధవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రియసాయిని మూడేళ్ల క్రితం కడప జిల్లా రాజంపేటకు చెందిన వ్యక్తికిచ్చి పెళ్లి చేశారు. ఏడాదికే భర్తతో విడుకులు తీసుకుని, పుట్టింటికి చేరింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని ఇంటి నుంచే (వర్క్ ఫ్రం హోమ్) చేస్తుండేది. తండ్రి సంపత్‌కుమార్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒంటరి జీవితం భరించలేక మనస్తాపం చెంది ఇంట్లో దూలానికి చు న్నీతో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘ టనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. తండ్రి సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

### భర్త వేధింపులు భరించలేక..

భర్త వేధింపులు, నిర్లక్ష్యాన్ని భరించలేక బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లికి చెందిన శాంతి (24) మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలేపల్లికి చెందిన వ్యక్తితో శాంతికి వివాహమైంది. భర్త వేధించడం, సరిగా చూసుకోకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. శాంతికి 8 నెలల పాప ఉంది. ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు.

### తాగుడుకు భార్య డబ్బు ఇవ్వలేదని..

మద్యం తాగడానికి భార్య డబ్బు ఇవ్వలేదని శెట్టూరు మండల కేంద్రానికి చెందిన శంకర (39) గురువారం ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకర, లలిత దంపతులు కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుండేవారు. శంకర తాగుడుకు బానిసయ్యాడు. కూలి చేస్తే వచ్చే డబ్బు శంకర తాగుడుకు ఖర్చు చేస్తుండేవాడు. భార్య వద్ద కూడా డబ్బు తీసుకునేవాడు. ఈ నేపథ్యంలో గురువారం మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడిగాడు. తన వద్ద లేవని ఆమె చెప్పడంతో మనస్తాపం చెందిన శంకర ఇంట్లోనే ఉరేసుకుని, మరణించాడు. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులకు పోలీసులకు సమాచారం అందించారు. శంకర భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

### వ్యసనాలకు బానిసై...

వ్యసనాలకు బానిసై శెట్టూరు మండల కేంద్రానికి చెందిన బోయ మల్లికార్జున (50) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం మల్లికార్జున.. తల్లిదండ్రుల వద్దకెళ్లి చెల్లెళ్లతో రాఖీలు కట్టించుకుని, ఇంటికొచ్చాడు. వ్యసనాలకు బానిసవడంతో మనస్తాపం చెంది మధ్యాహ్నం తన పొలంలోని వేపచెట్టుకు తాడుతో ఉరేసుకుని, మరణించాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు పొలానికెళ్లి మల్లికార్జున మృతదేహంపై పడి బోరున విలపించారు. మల్లికార్జునకు కడుపునొప్పితో బాధపడుతుండేవాడనీ, ఇటీవలే శస్త్రచికిత్స కూడా చేయించుకున్నట్లు బంధువులు తెలిపారు. మల్లికార్జున భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అప్పుల బాధతో..

తాడిపత్రి మండలం పులిప్రొద్దుటూరు గ్రామానికి చెందిన దూదేకుల హాజీవలి (35) అప్పులబాధ భరించలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హాజీవలి వ్యాన్ కొనుగోలుకు పరిచయస్తుల వద్ద దాదాపు రూ.14లక్షలు అప్పులు చేశాడు. వ్యాన్‌ను అద్దెకు తిప్పేవాడు. కొంతకాలంగా బాడుగలు లేకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. రుణదాతల ఒత్తిళ్లు అధికమవడంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. అతడి భార్య ముంతాజ్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# మద్యం మత్తులో వీరంగం

## రెండు వర్గాల ఘర్షణ

## చికిత్స పొందుతూ మరోసారి గొడవ

## అడ్డు వచ్చిన డాక్టర్, వైద్యసిబ్బందిపై దాడి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కదిరిఅర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి వచ్చి, అక్కడ మరోసారి దాడులు చేసుకున్నారు. ఈక్రమంలో అడ్డొచ్చిన, వైద్యురాలు, సిబ్బందిపై కూడా దాడికి దిగిన ఘటన కదిరిలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన అనిల్‌కుమార్, సాయిగణేష్, రాజశేఖర్, భరత్, కార్తీక్, మణికంఠ, అశోక్, మరోవర్గం గిరినాయక్, చంప్లానాయక్, రెడ్డెప్పనాయక్ బుధవారం రాత్రి కుటాగుళ్లలోని బెల్టు షాపు వద్ద చిల్లర విషయంలో గొడవ పడ్డారు. పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు గాయపడ్డారు. వారిని బంధువులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరోసారి ఘర్షణ పడ్డారు. కొంతమంది డాక్టర్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోగా, మరో వర్గం తలుపులు బద్దలు కొట్టి, లోపలున్నవారిపై దాడిచేశారు. అడ్డొచ్చిన డాక్టర్ శిరీష, స్టాఫ్‌నర్సు బాలమణి, ఎంఎన్ఓ దాదా పీర్, సెక్యూరిటీగార్డు ఈశ్వరయ్యపై కూడా దాడికి తెగబడి గాయపరిచారు. స్టాఫ్ నర్సుకు కుడిచేయి విరిగింది. డాక్టర్ డయల్ 100కు ఫోన్ చేయగా, పట్టణ సీఐ నారాయణరెడ్డి తన సిబ్బందితో వెళ్లి ఘర్షణ పడుతున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాల్లో 9మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### వైద్యుల నిరసన

విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బందిపై దాడిని నిరసిస్తూ ఆసుపత్రి వర్గాలు గురువారం ఆందోళన చేపట్టాయి. ఉదయం 9నుంచి 10గంటల వరకు విధులు బహిష్కరించారు. వారు మాట్లాడుతూ.. విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఆందోళనలో ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ హుస్సేన్, డాక్టర్లు మధూసూదన్, అశోక్, రిషితా, వైద్యసిబ్బంది ఉన్నారు.

### పార్టీకి ఆపాదించడం తగదు: ఎమ్మెల్యే కందికుంట

మద్యం మత్తులో అల్లరిమూకలు గొడవపడితే అది టీడీపీ కార్యకర్తలు, వైసీపీ కార్యకర్తలపై దాడి చేసినట్లు కొన్ని చానల్స్‌లో ప్రసారం చేయడం సరికాదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం ఆసుపత్రిని సందర్శించి, సంఘటనపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దుండగులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### రాజకీయాలకు తావులేదు: రత్న, ఎస్పీ

జిల్లా ఎస్పీ రత్న గురువారం కదిరి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. గొడవకు గల కారణాలకు పోలీస్ అధికారులతో ఆరాతీశారు. గొడవలో గాయపడి చికిత్స పొందుతున్నవారితో మాట్లాడారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదని, మద్యం మత్తులోనే దాడులు చేసుకున్నట్లు ఎస్పీ ఎదుట వారి కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఘర్షణలో రాజకీయాలకు తావులేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### వైసీపీ నేతల హల్‌చల్

మద్యం మత్తులో రెండువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడితే దీన్ని వైసీపీ నేతలు రాజకీయాలకు ఆపాదించారు. స్వయంగా బాధితులు, వారి కుటుంబాలు, ఎస్పీ కూడా ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావులేదని చెప్పినా వైసీపీ నాయకులు మాత్రం హంగామా మానలేదు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కార్యకర్త మక్బూల్ తన అనుచరులతో ఆసుపత్రికి చేరుకుని సంఘటనను టీడీపీపైకి నెట్టడంపై పలువురు విమర్శిస్తున్నారు.

# మాటల్లో పెట్టి.. మాయ..!

## బస్సుల్లో చోరీ చేసే మహిళల ముఠా అరెస్టు

## రూ.23 లక్షల విలువైన బంగారం ఆభరణాలు స్వాధీనం




నగలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్



అరెస్టు అయిన మహిళలు

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లలో తిష్ట వేస్తారు. ఆభరణాలతో ప్రయాణించే మహిళలను గుర్తించి.. వారు ఎక్కే బస్సులో ఎక్కేస్తారు. మాటల్లో పెట్టి.. మాయ చేసేస్తారు. సొమ్మంతా కాజేసి మాయమైపోతారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ కేంద్రానికి చెందిన నలుగురు మహిళలు ఒక ముఠాగా ఏర్పడి.. చోరీలు, దోపిడీలకు తెగబడుతున్నారు. వీరిని రాయదుర్గం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన 242.5 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్పీ జగదీష్ గురువారం మీడియా సమావేశం నిర్వహించి, ఈ కేసు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లాకు చెందిన సుమతి(46), గీత(37), రంజిత (33), బృంద(27) సమీప బంధువులు, రక్త సంబంధీకులు. ఈ ముఠాలో సుమతి కీలకం. పూసలు, రోల్డ్ గోల్డ్ నగల వ్యాపారం వీరి వృత్తి. కానీ ఈ ముసుగులో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. గత ఏడాది కణేకల్లు బస్టాండ్‌లో ఓ మహిళ తన బంగారం ఆభరణాలను జాగ్రత్తగా పెట్టుకోవడం చూశారు. ఆమె ఎక్కిన బస్సులోనే ప్రయాణం చేశారు. ఆమెతో మాటలు కలిపి ఏమార్చారు. ఆమె కళ్లు గప్పి బ్యాగ్‌లో ఉన్న 70 గ్రాముల బంగారం లాంగ్ చైన్, 50 గ్రాముల బంగారం నెక్లెస్‌ను తస్కరించి మాయమైపోయారు. ఈ నెల 23వ తేదీ కళ్యాణదుర్గం బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న ఓ ప్రయాణికురాలిపై నిఘా వేశారు. ఆమెను ఎక్కిన బస్సునే ఎక్కారు. ఆమె కణేకల్లు క్రాస్ వద్ద బస్సు దిగబోతుండగా, పథకం ప్రకారం అడ్డుగా నిలిచారు. దీంతో బస్సు స్టాప్ దాటి కొంత దూరం వెళ్లింది. ఎవరూ లేనిచోట ఆగింది. అక్కడ ఆమెతోపాటు ఈ ముఠా దిగింది. బృంద కత్తి తీసుకుని ఆ మహిళను బెదిరించింది. మిగిలినవారు ఆమె వద్ద ఉన్న 107.5 గ్రాముల లాంగ్ చైన్, గాజులు, డాలర్ చైన్, ఉంగరం, కమ్మలను బంగారు ఆభరణాలను లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ రంగంలోకి దిగారు. కణేకల్లు మండలం యర్రగుంట క్రాస్ వద్ద ఈ ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన రాయదుర్గం రూరల్ సీఐ, కణేకల్లు, బొమ్మనహాళ్ ఎస్ఐ, పీఎస్ఐ నారాయణరెడ్డిని ఎస్పీ అభినందించారు.

# చీనీకి చవితి ఎఫెక్ట్

## మార్కెట్‌కు తగ్గిన దిగుబడులు

అనంతపురంరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చీనీమార్కెట్‌కు వినాయక చవితి పండుగ ఎఫెక్ట్ పడింది. ఈక్రమంలో అనంత వ్యవసాయ మార్కెట్‌కు గురువారం ఉత్పత్తులు తగ్గిపోయాయి. అధికారుల లెక్క ప్రకారం 500 టన్నుల మేర కాయలు నిలిచిపోయాయి. రోజూ మార్కెట్‌కు సీజనల్ కాయలు 500 నుంచి 1200 టన్నుల వరకు వస్తుండేవి. బుధవారం 451, గురువారం 225 టన్నులు మాత్రమే వచ్చాయి. ఈ రెండు రోజులు టన్ను గరిష్ఠంగా 15,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.11,500 పలికాయన్నారు.

## ఆంధ్రా క్రికెట్ జట్టుకు గిరినాథ్ రెడ్డి



గిరినాథ్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రికెట్ జట్టుకు జిల్లాకి చెందిన గిరినాథ్ రెడ్డి ఎంపికయ్యాడు. 2వతేదీ నుంచి బెంగుళూరులో నిర్వహించే తిమ్మప్పయ్య ఆలిండియా క్రికెట్ టోర్నీలో ఆంధ్రా జట్టు తరఫున గిరినాథ్ రెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నాడు. శుక్రవారం నుంచి మంగళగిరిలో నిర్వహించే శిక్షణ శిబిరంలో గిరినాథ్ రెడ్డి పాల్గొననున్నాడు.

## సహకార శాఖలో ఉద్యోగోన్నతి బదిలీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార శాఖలో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. హిందూపురం ఎస్‌డీఎల్‌సీఓ అసిస్టెంటర్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డికి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ప్రమోషన్ ఇస్తూ అనంతపురం డీఎల్‌సీఓగా బదిలీ చేశారు. ఇక్కడ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న ఆదినారాయణకు డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ హిందూపురానికి బదిలీ చేశారు. రాయదుర్గంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగవీణను డిప్యూటీ రిజిస్ట్రార్‌గా అనంతపురం డీసీఏఓగా నియమించారు. అనంతపురం డీఎల్‌సీఓ కార్యాలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సతీష్‌కుమార్‌ను అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ప్రమోషన్ ఇస్తూ రాయదుర్గం ఎస్‌డీఎల్‌సీఓగా బదిలీ చేశారు.

## క్వాంటమ్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు: వీసీ

అనంతపురంరూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ అనిత అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ.. క్వాంటమ్ టెక్నాలజీ అనేది క్వాంటమ్ మెకానిక్ సూత్రాలను ఉపయోగించి, చిన్న కణాల లక్షణాలను(క్వాంటా) ఉపయోగించుకునే అధునాతన సాంకేతిక రంగం అన్నారు. ప్రస్తుతం ఉన్న క్లాసికల్ టెక్నాలజీలకు మించి, సంక్లిష్ట సమస్యలను పరిష్కరించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సెన్సార్ వంటి వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి, సదస్సు కన్వీనర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి: జేసీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): త్వరగా భూ సేకరణ పూర్తి చేయాలని జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ సెక్టార్, వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై ఆర్డీఓలు, కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ, తహసీల్దార్లు, సర్వే ఏడీ, మండల సర్వేయర్ల తో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్ 544డీ, ఎన్‌హెచ్ 47, 42, 155 తదితర ప్రాజెక్టులకు భూసేకరణ, భూ బదలాయింపునకు సంబంధించి ప్రక్రియలు వేగంగా చేపట్టాలన్నారు. ఇందులో ఎలాంటి ఆలస్యం ఉండరాదన్నారు. రెవెన్యూ సమస్యలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి సంబంధించి భూసమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే వాటిని సరి చేయాలన్నారు.

## తల్లీకూతురు అదృశ్యం

కణేకల్లు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన భారతి (30).. కూతురు జాస్మిక(6)తో కలిసి రెండురోజుల క్రితం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. జక్కలవడికికి చెందిన భారతిని పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వన్నూరుస్వామికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం. వన్నూరుస్వామి తాగుడుకు బానిసవడంతో భారతి కూలి పనులు చేసూకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. భర్తలో మార్పు రాకపోవడంతో మనస్తాపం చెంది, మంగళవారం సాయంత్రం కుమార్తె జాస్మికతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. నాలుగేళ్ల కుమారుడిని ఇంటి వద్దే వదిలేసి వెళ్లిపోయింది. రెండురోజులైనా భారతి జాడ తెలియకపోవడంతో ఆమె సోదరుడు వన్నూరుస్వామి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు.

## టమోటా కిలో రూ.30

అనంతపురంరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూ ప్‌కుమార్ తెలిపారు. గురువారం మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.17, సరసరా ధర రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు.

## మత సామరస్యాన్ని చాటిన ముస్లిం చిన్నారులు



వినాయకుడి మండపం ఏర్పాటు చేసిన రిహాన్, షెక్షా, బాషా

అనంతపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కులం, మతం అన్న భేదం లేదు.. దేవుడు అందరికీ దేవుడే.. వేడుక అందరికీ వేడుకే అంటూ వినాయక చవితి వేడుకను నిర్వహించి మతసామరస్యాన్ని చాటుకున్నారు ముస్లిం విద్యార్థులు. అనంతపురం నగరానికి చెందిన రిహాన్, షెక్షా, బాషా అనే చిన్నారులు నిరుపేదలు. అయితే వీరు వినాయక విగ్రహ ఏర్పాటుకు ఎవరినీ చెందాలు అడగలేదు. తమవద్ద ఉన్న పాకెట్ మనీని ముగ్గురూ జమచేసుకోగా రూ.400 అయింది. ఆ సొమ్ముతోనే తమకు తోచిన మేరకు రామచంద్రనగర్‌లోని టీటీడీ కల్యాణమండపం ముందు చిన్నపాటి గణేష మండపాన్ని తీర్చిదిద్దారు. వినాయకుడి ప్రతిమను తీసుకువచ్చి పూజలు నిర్వహించారు.

## గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు




పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం వెంకటాపురంలోని తన నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషలతో తులతూగాలని స్వామివారిని మొక్కుకున్నారు.

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

### గిడుగు వెంకట రామమూర్తి (జయంతి)



ఆంధ్రదేశంలో వ్యవహారిక భాష ఉద్యమానికి మూల పురుషుడు గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగస్టు 29న శ్రీకాకుళం ప్రాంతం పర్వతాల పేట గ్రామంలో జన్మించారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుకభాషలోకి తీసుకొచ్చి భాష అందాన్ని తెలియజేసిన మహనీయుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. కైజర్ ఎ హింద్, రావు సాహెబ్ బిరుదులు పొందారు. కళాప్రపూర్ణ పురస్కార గ్రహీత. ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ఆచరిస్తున్నారు. 1940 జనవరి 22న కన్నుమూశారు.

### ధ్యాన్‌చంద్ (జయంతి)



హాకీ మాంత్రికుడిగా పేరొందిన ధ్యాన్‌చంద్ 1905 ఆగస్టు 29న అలహాబాద్‌లో జన్మించారు. దేశంలో హాకీ క్రీడకు గుర్తింపు తెచ్చారు. ఒలింపిక్స్‌లో మూడు బంగారు పతకాలు సాధించారు. 1928-64మధ్య 8 ఒలింపిక్స్ క్రీడలలో 7సార్లు గెలుపొందడంలో ఆయన కీలకులు. ఆర్మీలో మేజర్‌గా కొనసాగుతూనే క్రీడలకు వన్నె తెచ్చిన ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారం అందుకున్నారు. 1979 డిసెంబరు 3న కన్నుమూశారు. ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా ఆచరిస్తూ క్రీడలలో రాణించినవారికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న్ అవార్డుతో గౌరవిస్తున్నారు.

### ఇంద్రగంటి హనుమత్‌శాస్త్రి (జయంతి)



సాహితీవేత్తగా పేరొందిన ఇంద్రగంటి హనుమత్‌శాస్త్రి (హనుమచ్ఛాస్త్రి) 1911 ఆగస్టు 29న విశాఖపట్నం జిల్లా వీరవల్లి తాలూకా వడ్డాదిమాడుగుల గ్రామంలో జన్మించారు. గేయ రచయిత, కవిగా రాణించడమేకాక పలు రేడియో నాటికలను అందించారు. సంస్కృతాంధ్ర ఉపన్యాసకులుగా పనిచేశారు. ఆయన రాసిన కథలలో 'ఆరు నెంబరు గది'గా పేరొందింది. వ్యాసావళి, కాళిదాస కళామందిరము పేరొందాయి. ఆరుయుగాల ఆంధ్ర కవిత్ ప్రత్యేక రచన ఆకట్టుకుంది. 1987 నవంబరు 14న పరమపదించారు.

### రామకృష్ణ హెగ్డే (జయంతి)



జనతాపార్టీ నాయకుడిగా రాజకీయాలలో ఎంతోమందికి మార్గదర్శకత్వం వహించిన రామకృష్ణ హెగ్డే ఉత్తరకన్నడ జిల్లా సిద్దాపురలో 1926 ఆగస్టు 29న జన్మించారు. 1983 నుంచి 1988 వరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. కేంద్రమంత్రిగాను, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్‌గా కొనసాగారు. 'రాష్ట్రీయ నవ నిర్మాణ వేదిక' స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశారు. అంతేకాక మరణ మృదంగ, ప్రజాశక్తి వంటి సినిమాలతోపాటు కొన్ని నాటకాల్లో నటించారు. 2004 జనవరి 12న కన్నుమూశారు.

### మైఖేల్ జాక్సన్ (జయంతి)




'కింగ్ ఆఫ్ పాప్' అనువాదంతో పాప్ సింగర్‌గా పేరొంది, డ్యాన్సర్‌కు మారుపేరుగా నిలిచిన అమెరికాకు చెందిన మైఖేల్‌జాక్సన్ 1958 ఆగస్టు 29న జన్మించారు. అమెరికన్ గేయ రచయితగా, గాయకుడిగాను రాణించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన ఆల్బమ్స్ లక్షల సంఖ్యలో అమ్ముడయ్యాయి. 13 గ్రామీ అవార్డులు, 39 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌తోపాటు ఎన్నో పురస్కారాలు పొందారు. 2009 జూన్ 25న కన్నుమూశారు.

### డాక్టర్ కె. రాధాకృష్ణన్ (పుట్టినరోజు)



అంతరిక్ష పరిశోధక శాస్త్రవేత్త డాక్టర్ కే రాధాకృష్ణన్ 1949 ఆగస్టు 29న జన్మించారు. 2009-14 వరకు 'ఇస్రో' అధ్యక్షుడిగా వ్యవహరించారు. చంద్రయాన్-1 విజయవంతం అయ్యేందుకు కృషి చేశారు. ఇస్రో 37 స్పేస్ మిషన్‌లు సాధించడంలో ఆయన ఎంతో కీలకంగా వ్యవహరించారు. అందులో మంగళయాన్ ప్రయోగం ఒకటి.'పద్మభూషణ్' గ్రహీత. కర్ణాటక సంగీతం, కథాకళి కళాకారుడు. ఐఐటి ఖరగ్‌పూర్ సహా 12 యూనివర్శిటీలచే గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు.

### అక్కినేని నాగార్జున (పుట్టినరోజు)



దక్షిణాది ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున 1959 ఆగస్టు 29న మద్రాస్‌లో జన్మించారు. తండ్రి నాగేశ్వర రావు బాటలో ఆయన కూడా సినీరంగంలో సాగారు. నిర్మాతగా, బుల్లితెర వ్యాఖ్యాతగాను రాణించారు. తెలుగులో వందకుపైగా సినిమాలలో నటించారు. హిందీ, తమిళ భాషలలో కొన్ని సినిమాలలో నటించారు. 9 నంది అవార్డులు, 3 ఫిల్మ్‌అవార్డ్స్ సౌత్, జాతీయస్థాయిలో ఒక ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా పేరిట నాన్-ప్రాఫిట్ స్కూల్ నిర్వహిస్తున్నారు.

### హీనాసింధు (పుట్టినరోజు)



పిస్టల్ షూటింగ్‌లో 'అర్జున అవార్డు' గ్రహీత హీనాసింధు 1989 ఆగస్టు 29న పంజాబ్ రాష్ట్రం లూధియానాలో జన్మించారు. 10మీటర్ ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో వరల్డ్ రికార్డ్ సాధించారు. కాగా 2013లో ఆమె డెంటల్ సర్జరీలో బ్యాచిలర్ పట్టా అందుకున్నారు. పిస్టల్ షూటింగ్‌లో 2014లో నెంబరువన్ ర్యాంకుగా నిలిచారు. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో 10 మీటర్ల విభాగంలో బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నారు. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో 10మీటర్లలో రజత పతకం, 25మీటర్లలో బంగారు పతకం సాధించారు.



జేపీ నగర్‌లో భక్తుల సందడి..



పరమశివుడి రూపంలో..



గరుత్మంతుడిపై గణనాథుడు

# ఊరూరా వెలసిన ఉండ్రాళ్లయ్య

**(5వపేజీ తరువాయి)** వంటి అనేక రూపాల వినాయకులు ఆకర్షణీయంగా ఉన్నాయి.

### ఒక్కరోజే 2.19 లక్షల విగ్రహాల నిమజ్జనం

వినాయక విగ్రహాల నిమజ్జనం భారీ ఏర్పాట్ల మధ్యన జరిగింది. బుధవారం నగర వ్యాప్తంగా ఇళ్ళలోను, కూడళ్ళలో ఏర్పాటు చేసిన విగ్రహాలను సాయంత్రం నిమజ్జనం చేశారు. ప్రత్యేకంగా 41 చెరువులు, కళ్యాణిలతో పాటు 489 తాత్కాలిక మొబైల్ ట్యాంకులను బెంగళూరు మహానగర పాలికె సిద్ధం చేసింది. సాయంత్రం ప్రారంభమైన విగ్రహాల నిమజ్జనం రాత్రి పొద్దుపోయే దాకా సాగింది. తూర్పు డివిజన్‌లో 44,000, పశ్చిమ డివిజన్‌లో 60,703, దక్షిణ డివిజనల్‌లో అత్యధికంగా 79,039లు, బొమ్మనహళ్ళి డివిజన్‌లో 7028, దాసరహళ్ళి 1104, మహదేవపురలో 5690, రాజరాజేశ్వరీనగర్‌లో 13097, యలహంక డివిజన్‌లో 8492 విగ్రహాలను నిమజ్జనం చేశారు.

### రాజాజీనగర్‌లో అమెరికన్ డైమండ్ గణపతి

వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయకుల విగ్రహాలకు ప్రత్యేకత ఉంది. రాజాజీనగర్ ఓరయన్ మాల్ వెనుకభాగాన ఉండే మిల్క్ కాలనీలో అమెరికన్ డైమండ్స్‌తో గణపతిని రూపొందించారు. ఇక్కడ ఏడురోజుల పాటు పూజలు జరుపుతామని మండప కమిటీ అధ్యక్షులు శ్రీధర్ తెలిపారు. ముంబైలోని జువేరీ బజార్ నుంచి 12లక్షల విలువైన అమెరికన్ డైమండ్స్ కొనుగోలు చేసి వినాయకుడుని తీర్చామన్నారు. గత ఏడాది ఇదే తరహాలోనే అమెరికన్ డైమండ్స్‌తోనే విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాదితో పోల్చితే అరలక్ష అధికమైందన్నారు. ఇక జేపీనగర్‌లో సత్యగణపతి శిరిడిసాయి ట్రస్టు ఆధ్వర్యంలో పర్యావరణకు అనుకూలం అనే రీతిలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తమలపాకులు, కొబ్బరి గెరెలను ప్రత్యేకంగా తీర్చారు. ఆలయాన్ని పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా మార్చామని ట్రస్టు ఛైర్మన్ సీఆర్ రామమోహన్ రాజు తెలిపారు. ఐదురోజుల పాటు పూజలు చేస్తామన్నారు. ఆతర్వాత కొబ్బరి ఆకులు, తమలపాకులకు బెల్లం, చక్కెర, దానాను మిశ్రమం చేసి పశువులకు మేతగా ఇస్తామన్నారు. ఇక్కడ పూలు, పండ్లు కూడా వృథ కానీయమన్నారు.



వినాయకుడికి విద్యార్థుల పూజలు












బెంగళూరులో బీబీఎంపీ ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాల్లో విగ్రహాలను గంగమ్మ ఒడికి చేరుస్తున్న భక్తులు

# అరుణ కిరణం



కొండల్లో కమ్ముకున్న ఎర్రని మేఘాలు



కంప్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హంపి పర్యాటక క్షేత్రంలో ప్రతీది అద్భుతమే..నిత్యం కనిపించే సూర్యోదయ, సూర్యాస్తమయాలు కూడా పర్యాటకులను విశేష అనుభూతి కలిగిస్తాయి. అలాంటి దృశ్యమే గురువారం ఆవిష్కరించింది. ఆకాశం ఎరుపెక్కి అంతా అరుణమయంగా మారింది. సాయంత్రం సూర్యాస్తమయం వేళ దేవాలయాలు, మండపాలు హోయలు తిరుగుతున్న నది ఏకశిలారథం నవదిబ్బ విరుపాక్ష ఆలయం పుష్కరేణి తదితరవి పూర్తిగా కట్టుకున్నాయి. ఏకశిలా రథం మార్గంలో సూర్యకిరణాలు మండపాల వద్ద నుంచి చొచ్చుకుని వస్తున్నట్లు కనిపించాయి. విరుపాక్షేశ్వర ఆలయం ప్రాంగణంలో ఎర్రగా మబ్బులతో ఆకర్షణీయంగా మారింది. మాతంగి పర్వతం పైన మబ్బులతో పూర్తిగా ఆకర్షణీయంగా మారింది. మొత్తానికి హంపిలో ఈ సాయంత్రం మబ్బులతో పూర్తిగా ఆకట్టుకుంటున్నాయి.

# ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

- డిపో మేనేజర్ వేధిస్తున్నాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- బీదర్ జిల్లాలో దారుణం



డ్రైవర్ రాజప్ప(ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డిపో మేనేజర్ వేధిస్తున్నారని జిల్లాకేంద్రమైన బీదర్‌లోని ఒకటో నంబరు డిపోలో డ్రైవర్‌గా సేవలందిస్తున్నన అణదూరు గ్రామ నివాసి రాజప్ప(59) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. బీదర్-బళ్ళారిల మధ్యన స్లీపర్ కోచ్ బస్సుకు రాజప్ప డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. బీదర్ డిపో మేనేజర్ విట్టల్ బోవి నిరంతరంగా వేధిస్తుండేవారని రాజప్ప కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇటీవల కొన్నిరోజుల కిందట రాజప్ప ఆరోగ్యం సహకరించడం లేదని, ప్రమాదం జరిగి కాలికి దెబ్బ తగిలినందున డ్రైవిగ్ కాకుండా ఆఫీసు డ్యూటీకు బదిలీ చేయాలని కోరుకున్నారన్నారు. అందుకు డిపో మేనేజర్ అంగీకరించకపోగా సెలవుపై వెళ్ళేందుకు అడ్డు పడ్డారన్నారు. సుదూరాన ఉండే రూట్‌కే ప్రతి రోజు పంపేవారని వాపోయారు. డ్యూటీ చేస్తున్న బస్సులోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతి చెందిన రాజప్పకు భార్యతోపాటు ఎనిమిది మంది కుమార్తెలు ఉన్నారు. రాజప్ప కుటుంబీకులతోపాటు ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకులు డిపోవద్ద ఆందోళన చేశారు.

# అడ్డుగా మారిన డివైడర్..!

**ప్రమాదకరంగా జేఎన్‌టీయూ రహదారి**

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): డివైడర్లను రోడ్డుకు అడ్డంగా మార్చడంతో ప్రమాదాలకు అడ్డాగా మారింది. కలెక్టరేట్ నుంచి జేఎన్‌టీయూ, హౌసింగ్‌బోర్డు, శారదానగర్‌వైపు వెళ్లే ప్రధాన రహదారిలో డివైడర్లు ఏర్పాటు చేశారు. కొందరు రోడ్డుకు సమానంగా ఉన్న డివైడర్లను అడ్డంగా తిప్పేశారు. దీంతో వాహనదారులు అడ్డంగా తిప్పిన డివైడర్లను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. నగరపాలక సంస్థ, పోలీసులు అనుమతి లేకుండా డివైడర్లను ఎలా అడ్డంగా మార్చారని పలువురు బాధితులు ప్రశ్నిస్తున్నారు. డివైడర్లను అడ్డంగా మార్చడంతో పందులు, ఆవులు, కుక్కలు ఆ సందుల్లో దూరి వాహనాల కిందికి వచ్చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. వెంటనే అడ్డంగా మార్చిన డివైడర్లను సక్రమంగా మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.



కలెక్టరేట్ నుంచి జేఎన్‌టీయూ వెళ్లే ప్రధాన రహదారి



డివైడర్లను అడ్డంగా పెట్టడంతోనే ప్రమాదాలు

# వ్యాపారవేత్తతో యాంకర్ అనుశ్రీ వివాహం



పెళ్లి పీటలపై అనుశ్రీ, రోషన్

బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కన్నడలో దాదాపు రెండు దశాబ్దాలుగా పేరొందిన యాంకర్ అనుశ్రీ, వ్యాపారవేత్త రోషన్‌తో కలసి ఏడడుగులు నడిచారు. మంగళవారం జరిగిన ఈ వివాహంలో అత్యంత సన్నిహితులు, బంధువులు, సినిమా రంగానికి చెందిన కొందరు ప్రముఖులు వివాహంలో భాగస్వామ్యులయ్యారు. కొన్నేళ్ళుగా ప్రేమలో ఉండే వీరు ఎట్టకేలకు వివాహం చేసుకున్నారు. హిందూ సంప్రదాయబద్ధంగా వివాహం జరిగింది. ప్రముఖ నటులు శివరాజ్‌కుమార్ దంపతులు, ధనుంజయ్, చైత్ర ఆచార్, నాగభూషణ్, సంగీత దర్శకులు హంసలేఖ, శరణ్, ప్రేమా, శ్వేతచంగప్ప, విజయరాఘవేంద్ర, నెనపరిలి ప్రేమ్, రాజ్ బిశెట్టితోపాటు పలువురు పాల్గొన్నారు. కన్నడ సినిమాలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమమైనా అనుశ్రీ యాంకరింగ్ ఉంటుందనేలాంటి పేరు సంపాదించారు. పలు ఛానల్స్‌లోను ఆమె పలు కార్యక్రమాలు చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని మార్నేంపల్లి గ్రామ శివారులో 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తాడిపత్రికి చెందిన దంపతులు రాఘవేంద్ర, అశ్విని కూతురు కుందనతో కలసి గుంతకల్లుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మార్నేంపల్లి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఆ ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# నెరవేరిన దశాబ్దాల కల..!

- ఎమ్మెల్యే చొరవతో లింగనపల్లి గ్రామ విద్యుత్ సమస్య పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాప్తాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): లింగనపల్లి గ్రామ ప్రజల దశాబ్దాల సమస్య పరిష్కారమయ్యింది. ప్రజలు విద్యుత్ సమస్యతో సత్తమయ్యేవారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుంతోనని బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బొమ్మేపర్తి పంచాయతీ లింగనపల్లి గ్రామంలో ఇళ్లపైన 11 కేవీ విద్యుత్ తీగలను పొలాలకు సరఫరా చేశారు. ఇళ్లపైన తీగలు ఉండటంతో ప్రజలు భయాందోళన చెందేవారు. కొంతమంది ప్రమాదాల బారిన పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇళ్లపైన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని గ్రామస్థులు పలుమార్లు విన్నవించినా ఏ అధికారి, రాజకీయ నాయకులు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల ప్రచార సమయంలో పరిటాల సునీత, మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి లింగనపల్లి గ్రామానికి వచ్చినప్పుడు సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించి పొలాల్లో అమర్చారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

# నాకు ఏం జరిగినా.. ఈడీ అధికారుదే బాధ్యత

- కోర్టులో చిత్రదుర్గ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పి

బెంగళూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): 'నాకు ఏమైనా జరిగితే అందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంద'ని చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పి పేర్కొన్నారు. అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌ల ఆరోపణల మేరకు ఈడీ అధికారులు గత వారం దాడి చేసి రూ.12 కోట్ల నగదుతో పాటు కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. సిక్కింలో అరెస్టు చేసిన వీరేంద్రపప్పిను బెంగళూరుకు తీసుకువచ్చిన ఈడీ అధికారులు ఐదు రోజుల కస్టడీ ముగిసిన మేరకు గురువారం కోరమంగళలోని 35వ సీసీహెచ్ కోర్టు ముందు హాజరుపరిచారు. ఇదే సందర్భంలోనే న్యాయమూర్తి గజాననభట్ ముందు నిందితుడు వీరేంద్ర పలు వ్యాఖ్యలు చేశారు. తాగేందుకు కొళాయి నీరు ఇచ్చారని గాలి వెలుతురు లేని గదిలో బంధించారని, కనీసం కిటికీ కూడా లేదన్నారు. ఫుడ్ పాయిజన్‌తో శ్వాస ఆడక ఇబ్బంది పడ్డానన్నారు. కనీసం ఓ కుర్చీ లేదని ప్లాస్టిక్ కంటైనర్‌లో ఆహారం ఇస్తున్నారని తనకు ఏదైనా జరిగినా, తాను మృతిచెందినా అందుకు ఈడీ అధికారులే కారకులన్నారు. తనపట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఇదే సందర్భంలోనే వీరేంద్ర తరుపు న్యాయవాదులు కనీస సౌకర్యాలు సమకూర్చాలని వాదించారు. పరిశీలిస్తామంటూ న్యాయమూర్తికి వివరించారు.



## తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1626.06 | 1,628.56 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 19.617 | 21,678 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 19,412 | 10,107 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 80.00 | 88.76 |

# చురుగ్గా ఫ్లై ఓవర్ మరమ్మతు పనులు




మరమ్మతు పనుల్లో కార్మికులు

హోసూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హోసూరు బస్టాండ్ సమీపంలోని ఫ్లై ఓవర్ మరమ్మతుపనులు చురుగ్గా సాగుతున్నాయి. జూన్ 21న ఫ్లై ఓవర్‌కింది భాగాన ఒకరకమైన బేరింగ్‌లు దెబ్బతిన్నాయి. ఇటీవలే జాతీయ రహదారి విభాగం అధికారులు పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండే ఫ్లై ఓవర్‌పై మరమ్మతు కారణంగా ట్రాఫిక్‌ను మళ్లించారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఫ్లై ఓవర్‌కు అవసరమైన బేరింగ్‌లను సిద్ధం చేసింది. మరో నాలుగైదు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి కానున్నాయని అధికారులు తెలిపారు.

## పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

● కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్థిక సుస్థిరత సాధించడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపీసీ) సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రా మిక రంగాన్ని మరింత విస్తృతపరిచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోనే అడుగు పెట్టాలనుకున్నవారికి ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు అధికారులు బ్యాంకర్ల తో సమన్వయం చేసుకోవాలన్నారు. పెట్టుబడి రాయితీ కింద జిల్లాలోని 20 పరిశ్రమలకు రూ. 10.06 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో పరిశ్రమ శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, జిల్లా పరిశ్రమల అధికారి రాధాకృష్ణన్, ఏపీఐఐసీ జనరల్ మేనేజన్ సోనిన హాని, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీపీఓ సమత, ఉద్యాన శాఖ డీడీ చంద్రశేఖర్ తదితరులున్నారు. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతగా పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ ఆధికారులను ఆదేశించారు.




కంప్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



సర్వమతాలను ఆశీర్వదిస్తూ..



శ్రీకృష్ణుని అలంకరణలో వినాయకుడు

# రావయ్యా.. గణపయ్యా

● ఉభయ జిల్లాల్లో గణనాథుడికి ఘనస్వాగతం



ఆనందం వ్యక్తం చేస్తున్న లక్ష్మి

కంప్లి/బళ్లారిరూరల్/సిరుగుప్ప/రాయచూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : వినాయక పండుగను పురస్కరించుకుని పట్టణాలు, గ్రామాల్లో ఏ వాడలో చూసినా వినాయకుడిని ప్రతిష్ఠించారు. కంప్లి, కురుగోడు సిరిగేరి కుడితిని పట్టణాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో గత 35 యేళ్లుగా వినాయక మహా మండలి ఆధ్వర్యంలో వినాయకుని పండుగ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే అంబేద్కర్ సర్కిల్లో లయన్స్ గ్రూపు ఆధ్వర్యంలో అమ్మవారి ఒడిలో వినాయకుడు పూర్తిగా ఆకట్టుకుంటున్నాడు. కురుగోడు పట్టణంలో రైతు భవనంలో కూర్చోబెట్టిన వినాయకుడు అయోధ్యరామ వేషధారులతో వినాయకుడు పూర్తిగా ఆకట్టుకున్నారు. అలాగే కుడితిని పట్టణంలో గుహలో ధ్యానం ముద్రలో వినాయకుడు రూపంలో ఆకట్టుకున్నారు. హంపి పుణ్యక్షేత్రంలో శాశ్వేకాళ్ వినాయకుడు ఆలయంలో పుష్పాలతో ఆలయాన్ని అలంకరించి గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హంపిలో వుండే లక్ష్మీ (ఏనుగు) పైకి లేచి గంతులు వేస్తూ పర్యాటకుల్ని ఆకట్టుకుంటోంది.



సిరుగుప్పలో..





రాయచూరులో..



కంప్లిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



పీడీ హళ్లిలో..

# ప్రముఖుల జయంతులను ఘనంగా జరుపుకుందాం: ఏసీ

బళ్లారి సిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వివిధ ప్రముఖుల జయంతి ఉత్సవాలను అర్థవంతంగా జరుపుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ పి.ప్రమోద్ అధికారులకు సూచించారు. నగరంలోని అసిస్టెంట్ కమిషనర్ హాల్లో గురువారం వివిధ ప్రముఖుల జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సెప్టెంబర్ 7న బ్రహ్మశ్రీ నారాయణగురు జయంతి, సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం ,జిల్లాపంచాయితీ ఆధ్వర్యంలో కన్నడ సాంస్కృతిక శాఖ అర్థవంతంగా చక్కగా నిర్వహిస్తుందని ఆయన అన్నారు. అందరూ పాల్గొని జరుపుకుంటే జయంతి కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. అందువల్ల అన్ని వర్గాలు, సంఘాలు,సంస్థల నాయకులు సాధారణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా కన్నడ సంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, విద్యాశాఖ జిల్లా స్థాయి అధికారులు, కమ్యూనిటీ నాయకులు ఇతరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

# రూ.300 కోట్లతో విమానాశ్రయం

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో సీఎం, డీసీఎం చర్చలు: ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో రూ.300 కోట్ల అంచనాతో విమానాశ్రయ పనులు ప్రారంభిస్తామని బళ్లారి సీటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి తెలిపారు. గురువారం చాంబర్‌ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విమానాశ్రయం ఈ ప్రాంతానికి చాలా అవసరం ఉందన్నారు. కే.కే ఆర్‌డీబీ గ్రాంటు విమానాశ్రయ పనులు ప్రారంభించేందుకు కర్ణాటక ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందన్నారు. సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్ కేంద్ర విమానాయశాఖ మంత్రి రామోహన్‌నాయుడుతో విమానాశ్రమం నిర్మాణం పై చర్చించారన్నారు. విమానాశ్రయం నిర్మాణం పనులు త్వరలో ప్రారంభిస్తామని మంత్రి అంగీకరించినట్లు తెలిపారు.

## కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు: ఎంపీ



జన్మదిన వేడుకల్లో అభిమానులతో ఎంపీ నాసిర్ హుస్సేన్

బళ్లారి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని సీబ్లసీ సభ్యుడు, ఏఐసీసీ కార్యవర్గ సభ్యుడు, జమ్మూ, కాశ్మీ ప్రాంతాల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎంపీ(రాజ్యసభ) సభ్యుడు నాసీర్ హుసేన్ అన్నారు. బుధవారం మేయర్ నందీష్‌బాబు నివాసంలో నాసీర్ హుసేన్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అందరికీ న్యాయం జరుగుతుందని, ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ బుడా అధ్యక్షుడు ముల్లంగి రవింద్ర, మేయర్ నందీష్‌బాబు, నేతృత్వంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విక్కీ, నాయకులు గుడ్లరవి, సునీల్‌బుబు, రామాంజినేయులు పాల్గొన్నారు.

# బెంబేలెత్తిస్తున్న వీధికుక్కలు



బళ్లారి రోడ్డులో తిరుగుతున్న వీధికుక్కలు

కంప్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల బెడదతో గ్రామంలోను, పట్టణంలోను ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రెండు, మూడు రోజులుగా వీధి కుక్కల దాడిలో పలు గ్రామాల్లో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు పూర్తిగా భయభ్రాంతులకు గురవుతున్నారు. కంప్లి కురుగోడు తదితర గ్రామాల్లో వీధికుక్కల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా చేరుకుని కాలనీలోకి వచ్చే చిన్నారిపైన దాడి చేస్తున్నాయి. సంఖ్య పెరుగుతుండటం వల్ల పట్టణంలో తీవ్ర సమస్యను ఎదుర్కొంటోంది. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధుల్లోకి వచ్చిన వారిపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. ఇప్పుడు కుడితిని పట్టణంలో కొన్ని రోజులుగా ఎంతోమందిపై దాడి చేసి గాయపరిచాయి. ఇలా వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలపై దాడి చేసి వాటిని బోనులో పెట్టి ప్రజలకు విముక్తులు చేయాలని స్థానికులు కోరారు.

# ధర్మవరంలో ప్రతి ఇంటికీ తాగునీరు

రూ.2.54కోట్ల తాగునీటి ప్రాజెక్టు మంజూరు

మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణానికి రూ.2.54 కోట్ల తాగునీటి ప్రాజెక్టు మంజూరైందనీ, ప్రతి ఇంటికీ శుద్ధనీరు అందిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిధులు మంజూరు చేసిందన్నారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం మంత్రి మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటి సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా కళాజ్యోతి సర్కిల్ నుంచి ఎర్రగుంటలోని 300 కేఎల్ సంపు వరకు పాత పైపులైన్ తొలగించి, కొత్తగా 300 మి.మీ, డీ1 కే9 క్లియర్ వాటర్ పంపింగ్ మెయిన్ పైపులైన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ పైపులైన్ అమలులోకి రాగానే పట్టణంలోని అన్ని కాలనీల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చూస్తామన్నారు. త్వరతగతిన పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని మంత్రి వివరించారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ఎంఎస్ దివాకర్

## ఉపాధ్యాయుడిగా మారిన జిల్లా అధికారి

కంప్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : విజయనగర జిల్లా అధికారి దివాకర్ గురువారం గుడేకోట గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు సైన్స్ పాఠాలు బోధించి టీచర్‌గా మారారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే సదుపాయాల్ని వారికి చేరేలా ప్రభుత్వ ఉద్యోగుల్ని చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేటు పాఠశాలలతో పోటీపడాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని పాఠశాలలకు చేర్పి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్‌లు, షూస్ ఇతర అన్ని అందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు తరగతుల్లో బోధన చేసే సమయంలో విద్యార్థులకు ఆ సబ్జెక్టు అర్థమయ్యేలా బోధించాలన్నారు. విద్యతో పాటు విద్యార్థులకు క్రీడారంగంలో కూడా రాణించేలా శిక్షణ ఇవ్వాలని క్రీడా శిక్షణ ఉపాధ్యాయులకు సూచించారు.

# హోసూరు జోన్



పార్లమెంటు నమూనాలో వినాయక మండపం

## ఉత్సాహంగా వినాయక చవితి



ప్రజాప్రతినిధుల రూపాల్లో వినాయకుడు



ప్రత్యేక అలంకరణలో వినాయకుడు

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు సాగాయి. హోసూరు, శూలగిరి, బాగలూరు, డెంకణీకోట్టై తదితర ప్రాంతాలలో తెలుగు, కన్నడ మాట్లాడే వారు అధికంగా ఉండడంతో ఇక్కడ వేడుకలు మరింత సంబరంగా జరిగాయి. తేరుపేట ప్రాంతంలో ఆదిమల్లై శివన్ వంటి ఆకృతిలో ప్రదర్శనలు జరుగుతున్నాయి. రాయకోట్టై రోడ్డులో పూరి జగన్నాథ ఆలయ నమూనాను ఏర్పాటు చేశారు. బృందావన్‌నగర్‌లో కర్ణాటకలో ప్రముఖమైన మురుడేశ్వర ఆలయ నమూనా, శ్రీనగర్‌లో ఢిల్లీలోని పార్లమెంటు నమూనా భక్తులను ఆకట్టుకుంది. ఇలా వేర్వేరు ప్రాంతాలలో విభిన్నమైన నమూనాలతో వినాయక మండపాలను తీర్చిదిద్దారు. మరోచోట కైలాసపర్వతగిరి నమూనాలో వినాయకుడు, జనపర వీధిలో ఆంజనేయ హృదయం ద్వారా జ్యోతిర్లింగాల నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజాప్రతినిధుల రూపంలో వినాయకుడు విశేషంగా ఆకట్టుకుంది. డెంకణీకోట్టై రోడ్డులోని శాంతినగర్‌లో పంచముఖి వినాయక ఆలయం ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అన్నాడీఎంకే నేత, ఎమ్మెల్యే కే.పీ.మునుసామి అన్నదానం నిర్వహించారు. సూలగిరి యూనియన్ సెక్రటరీ మాదేశ్, వెంకటాచలం, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మునుసామి

# వైభవంగా తుంగభద్ర హారతి



వాయనం సమర్పిస్తున్న మంత్రి రామలింగారెడ్డి



నదితీరాన ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజలు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటకలో శక్తి దేవతగా పిలుబడే హులిగిలోని హులిగమ్మ దేవి ఆలయం సమీపంలో తుంగభద్ర నది వద్ద మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా తుంగహారతిని నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ శాఖా పరిధిలోకి వచ్చే హులిగమ్మ దేవస్థానం అభివృద్ధి ప్రాధికార ఆధ్వర్యంలో మొదటి సారిగా తుంగభద్ర హారతిని తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు. గలగలమని ప్రవహించే నది నీటి శబ్దం, అలల సొగసులు, సమీపంలోని పాత రైల్వే వంతెనపై రైలు వెళ్తున్న దృశ్యం భక్తులు హారతి వైభవం కనువిందు చేసింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజు తంగడిగి, ఎంపీ రాజశేఖర్ హిట్నాల్, ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్, విధాన పరిషత్ సభ్యులు హేమలతా నాయక, మాజీ ఎంపి కరడి సంగణ్ణ, మునిరాబాద్ కాడా అధ్యక్షులు హసనసాబ్ దేటిహాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అమరేగౌడ బయ్యాపుర, మాజీ ఎమ్మెల్యే కె. బసవరాజు, హిట్నాళ్‌లతో పాటు అనేకమంది ఈ పూజా కార్యక్రమంలో తుంగభద్రకు హారతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాశీలో గంగా హారతి జరిపిన 15మంది అర్చకులు తుంగభద్ర హారతి కార్యక్రమం జరపడం విశేషం. దేవస్థానం ఆధ్వర్యంలో సార్వజనికులు రెండువేల హారతులను ఉచితంగా పంపిణీ చేసింది. కార్యక్రమానికి మొదట భారీగా వర్షం కురవడంతో ప్రజలు కొంత సేపు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సాయంత్రం దేవస్థానంలో చండికా హోం, అన్న సంతర్పణ, మహిళల చేత కుంభమేళ ఊరేగింపు, నదీ ఈరంలో దేవి మూర్తి ప్రతిష్టాపన లాంటి విశేష కార్యక్రమాలు జరిగాయి. మహిళలకు ఒడి నింపే కార్యక్రమం, హొసపేట అంజలి కళాబృందం వారిచే భరత నాట్యం జరిగింది. హులిగి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నీలమ్మ గవిసిద్దప్ప గుంగాడి, జిల్లా పంచాయతీ సిఇఒ వర్ణిత్ నేగి, జిల్లా ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ధి, అడిషనల్ ఎస్పీ సిద్దరామేశ్వర, ఉప విభాగం అధికారి క్యాప్టన్ మహేష్ మాలగిత్తి, తహసీల్దార్ విఠల చాగులా, ప్రాధికార కార్యదర్శి హెచ్. ప్రకాష్ రావ్ పాల్గొన్నారు.

## గొర్రెలతో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎండనక... గాలనక నిత్యం అడవుల్లో సంచరిస్తూ గొర్రెలనే జీవనాధారంగా చేసుకుని జీవనం సాగించే గొర్రెల కాపరులకు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొట్టూరు తాలూకా కార్యాలయం ముందు వందలాది గొర్రెలతో చేరుకున్న గొర్రెల కాపరులు అధికారులపై నిరసన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో గొర్రెలు పలు వ్యాధుల బారిన పడడంతో సరైన సమయంలో మందులు, వైద్యం అందకపోవడంతో గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని, తద్వారా గొర్రెల కాపరులు నష్టపోతున్నట్లు రైతు సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి గుడియార్ మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. కొట్టూరు పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రోడ్డు ద్వారా గొర్రెలతోనే ర్యాలీ చేసిన అనంతరం తాలూకా తహసీల్దార్ జీకే అమరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు ప్రముఖులు ఎస్.కొట్రేష్, అలబూరు మంజునాథ్, అజ్జయ్య, హొసకోడిహళ్ళి, మూగప్ప, డి.కొట్రేష్, బాల గంగాధర్, పరసప్ప, రేవప్ప, బసప్ప, అజ్జయ్య, ఎన్.హనుమంతప్ప, కె.హెచ్. వీరభద్రప్ప, హారాళు గణేష్, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

## నాటుసారా బట్టీ ధ్వంసం

రాయచూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మస్కి తాలూకా మారలదిన్ని తండాలో అక్రమంగా నిల్వ ఉంచిన బట్టి సారాను ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మారలదిన్ని తండాకు చెందిన జ్యోతి అక్రమంగా బట్టి సారాను నిల్వం ఉంచినట్లు పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీస్ హోం గార్డ్ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో దాడి నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన ఈ దాడిలో 2 లీటర్ల బట్టి సారాతో పాటు సారా తయారీ కోసం ఉద్దేశించిన 10 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నారు. కాగా దాడి సమయంలో నిందితురాలు పరారు కాగా ఆమె పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారి మహ్మద్ హుసేన్ తెలిపారు.



బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు